క్లుప్తంగా

ఇన్‌చార్జ్ కమిషనర్‌గా శరత్‌చంద్ర


శరత్‌చంద్ర(ఫైల్)

గుత్తి: మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న మల్లెల లక్ష్మీదేవిని అనంతపురం అహుడా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గుత్తి మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా పని చేస్తున్న శరత్‌చంద్రను నియమించారు. కమిషనర్ మల్లెల లక్ష్మీదేవికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు.

అర్హులకు సాగుపట్టాలివ్వండి

యల్లనూరు: అర్హులకు సాగు పట్టాలివ్వాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సూరి కోరారు. ఈ మేరకు గురువారం వారు తహసీల్దార్ రమాదేవిని కలిసి వినతిపత్రం అందించారు. పల్లెల్లో చాలామంది ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో చాలామంది పేదలు ఉన్నారని, ప్రతి కుటుంబానికి ఐదెకరాలను కేటాయించాలన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ , జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, మండలాధ్యక్షులు సూరి, చౌదరి, కార్యదర్శి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి

యాడికి: గ్రామ పంచాయతీలోని పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రసాద్ కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అంతకుమునుపు పారిశుధ్య కార్మికులు బస్టాండు వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు.

పత్తిలో పంటకోత ప్రయోగాలు

శింగనమల: మండలంలోని చక్రాయిపేట రెవెన్యూ పొలంలో పత్తి పంటలో పంటకోత ప్రయోగాలు చేపట్టినట్లు ఏఓ చిన్నమ్మ తెలిపారు. పది మీటర్ల వ్యత్యాసంలో మూడో ప్రయోగంలో 300 గ్రాములు, నాలుగో ప్రయోగంలో 250 గ్రాముల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది అమరేష్, రైతులు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ఏపీఎస్పీ 14 బెటాలియన్ పోలీస్ యూనియన్ డైరీని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి చేతులు మీదుగా ఆవిష్కరించినట్లు యూనియన్ నేత పెద్దయ్య తెలిపారు. గురువారం డీజీపీని మర్యాద పూర్వకంగా కలిసి పోలీసు సిబ్బంది సమస్యలను వివరించామన్నారు. త్వరలో పోలీస్ వెల్ఫేర్ జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తామని డీజీపీ హామి ఇచ్చారని తెలిపారు. నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

యాడికి: జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ అలెగ్జాండర్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న గృహాలు మంజూరైన లబ్ధదారులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 603 మందికి ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన వారికి విడతల వారీగా వారి ఖాతాల్లో నగదు జమవుతోందన్నారు. సిమెంట్ కూడా ప్రభుత్వమే అందజేస్తుందని తెలిపారు. పొదుపు సంఘాల్లో ఉన్న లబ్ధిదారులకు రూ.30 వేల రుణం మంజూరు చేస్తామన్నారు. హౌసింగ్ ఏఈ ప్రశాంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ నేత మృతి


కృష్ణమోహన్ (ఫైల్)

తాడిపత్రి: తేరన్నపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కృష్ణమోహన్ అలియాస్ బాబు గురువారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందాడు. శివమాలలో వున్న కృష్ణమోహన్ స్నానం చేసుకుని, పూజ చేసుకునేందుకు గ్రామానికి వెళ్లిన సమయంలో హఠాత్తుగా గుండెపోటు రావడంతో ఇంటి అరుగుపైనే కుప్పకూలిపోయాడు. గ్రామస్తులు తాడిపత్రిలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, తనయులు హర్షవర్ధన్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయన మృతిపట్ల సంతాపం తెలిపారు. మృతుడికి భార్య సునీత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తొమ్మిది మంది బైండోవర్

యల్లనూరు: మండలంలోని గత ఏడాది కోడి పందెం ఆడుతున్న అనుమానిత వ్యక్తులు 9 మందిని ముందస్తు చర్యల్లో భాగంగా గురువారం ఎస్‌ఐ రామకృష్ణ తహసీల్దారు రమాదేవి సమక్షంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు, ఎస్‌ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోడిపందేలు ఆడకుండా ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు.

జగనన్నతోనే పేదల సంక్షేమం

- ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి


వెంగమనాయుడు కాలనీలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక 3 వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. వెంగమనాయుడు కాలనీ, చైతన్య కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్న సీఎం జగన్ పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన సాగితోందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రజలకు ఏ ఒక్కమేలు చేసింది లేదన్నారు. ఏ మేలు చేయని అబద్ధాలకోరు బాబు మరోసారి ప్రజలను మభ్యపెట్టేందుకు ఇవే నా చివరి ఎన్నికలంటూ మొసలికన్నీరు కారుస్తున్నారన్నారు. ఆయనకు వంతు పాడుతున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. రోడ్‌షోలకు ప్రజలను రప్పించేందుకు ప్రలోభాలకు గురి చేస్తూ ప్రజల ప్రాణాలను బలిగొన్న నరహంతకుడు చంద్రబాబు అన్నారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్లున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని ఆయన కోరారు. వైఎస్సార్‌సీపీ మండ ఇన్‌చార్జ్ జానకిరామిరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు చైర్మన్ గౌరప్ప, మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు బీ ఆసిఫ్, వార్డు ఇన్‌చార్జ్ సీ అబ్దుల్‌రజాక్, బీకే అన్వర్‌బాషా, కే మహబూబ్‌బాషా, అబుసాలేహా, బొల్లు వెంకట్రామిరెడ్డి, సీనియర్ నాయకులు చుక్కలూరు రామకృష్ణారెడ్డి, ఎస్ అనిమిరెడ్డి, ఓసీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మెత లక్ష్మి, బీకే అన్వర్‌భాష, బోయ రామచంద్ర, పార్వతీశ్వర్‌రెడ్డి, అనుంపల్లి సూరి, జనార్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, సింగరప్ప, చాకలి సుంకన్న, టీటీ నాగభూషణం, గౌస్‌పీరా, జగన్మోహన్‌రెడ్డి, ఓబుళాపురం ఓబులేసు, బయపరెడ్డి, దామోదర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రసాద్, ఆనందరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఫక్రుద్దీన్, ఆదాంఖాన్, షెక్షావలి, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సానుకూల స్పందన

పామిడి 3వవార్డులోని వెంగమనాయుడుకాలనీ, చైతన్యకాలనీలో ప్రజలు విన్నవించిన సమస్యలపై ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి సానుకూలంగా స్పందించారు. ఆయా కాలనీల్లోని సమస్యల పరిష్కరించాలని ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్‌కు సూచించారు.

గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు ప్రారంభం


తక్కళ్లపల్లి గ్రామ సచివాలయంలో ఆధార్ నమోదు పరిశీలిస్తున్న ఎంపీడీఓ యోగానందరెడ్డి

పుట్లూరు: ఆధార్ సేవల కోసం గతంలో మండలకేంద్రాలు, పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు, బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర పనులను చేయించుకోవడానికి అగచాట్లు పడేవారు. అయితే ఇప్పటికే గ్రామ సచివాలయాల ద్వారా అనేక సేవలను అందిస్తూ ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలను తీసుకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ఆధార్ సేవలను సైతం ప్రజల చెంతకు తీసుకొచ్చింది. పుట్లూరు మండల కేంద్రలోని గ్రామ సచివాలయలో మాత్రమే ఇప్పటి వరకు ఆధార్ నమోదు కేంద్రం ఉండగా ప్రస్తుతం మడ్డిపల్లి, కడవకల్లు, తక్కళ్లపల్లి గ్రామ సచివాలయాలకు వాటిని విస్తరించారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను గురువారం ఎంపీడీఓ యోగానందరెడ్డి పరిశీలించారు. గ్రామ సచివాలయాల ద్వారా ఆధార్ సేవలను అందించడటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

గుంతకల్లు: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జీ.చిరంజీవి డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలన్నారు. నాయకులు వెంకట్‌నాయక్, వినోద్‌కుమార్, చంద్ర, సాయి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


తాడిపత్రిటౌన్ : ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ చైతన్య, ఏబీవీపీ సభ్యులు


తాడిపత్రిటౌన్ : స్వామి వివేకానందుడి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న వక్తలు



గుత్తి: గేట్స్‌లో వివేకానందుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్ : స్వామీ వివేకానందుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని డీఎస్పీ వీఎన్‌కే చైతన్య యువతకు పిలుపునిచ్చారు .స్థానిక గాంధీ సర్కిల్ వద్ద గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో స్వామి వివేకానందస్వామి జయంతిని ఘనంగా జరిగాయి. వివేకానందుడి చిత్ర పట ఊరేగింపును డీఎస్పీ, పట్టణ సీఐ ఆనందరావు జెండా ఊపి ప్రారంభించారు. వివేకానందుడి వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఎంఈఓ నాగరాజు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అఖిల్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు, బాగ్ కన్వీనర్ భూపాల్, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక శివాలయం వీధిలోని సాయిబాబా ఆలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. షిర్డీసాయి, బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాల వద్ద వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సేవా సంస్థ కన్వీనర్ శ్రీ రంగయ్య, ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, కో కన్వీనర్ శ్రీరంగయ్య, సంయుక్త కార్యదర్శి గుర్రప్ప, సభ్యులు లక్ష్మీనారాయణ, మారుతీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో..

స్వామి వివేకానందస్వామి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు యువతకు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం జనసేవా సమితి అధ్యక్షుడు ఆది శేషు ఆధ్వర్యంలో స్వామి వివేకానందస్వామి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి, జేఎన్టీయూ వీసీ రంగ జనార్దన్ ,ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీ, వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షురాలు సుమతిరెడ్డి, గురుసేవా నందస్వామిజీ , బలిజ సేవా సంఘం అధ్యక్షుడు కల్లూరు శ్రీనివాసులు పద్మవాణి స్కూలు కరస్పాండెంట్ నాగేపీరయ్య హాజరై మాట్లాడారు.

వివేకానందుడు ఆదర్శప్రాయుడు

గుంతకల్లుటౌన్: యువతను జాగృతం చేసిన మార్గదర్శి, విశ్వవిఖ్యాత తత్వవేత్త స్వామి వివేకానంద నేటి యువతరానికి ఆదర్శప్రాయుడని డాక్టర్ హిమబిందు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాజగదీష్ పేర్కొన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డులోని వివేకానంద పార్క్‌లో వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుడి విగ్రహానికి రోటరీ క్లబ్ పట్టణ అధ్యక్షుడు వంకదారు ప్రదీప్ పూలమాల వేసి పూజ చేశారు. విద్యార్థుల వివేకానంద వేషధారణ పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. వివేకానందుడి మాటలు, సూక్తులు, రచనల గురించి విద్యార్థులు వివరించారు. ప్రతిభ కనబరిచిన వారికి వసంత్ మదన్ సౌజన్యంతో నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. రోటరీక్లబ్ జోనల్ కార్యదర్శి అనురాధ, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, డిష్ రాము, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, శిరీష్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో స్వామీ వివేకానందుడి జయంతిని నిర్వహించారు. ఆ మహనీయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిమి రామాంజి, నాయకులు వడ్డే రమేష్, సూర్యనారాయణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యాడికి: భారతీయ సంస్కృతిని పాశ్చాత్య దేశాలకు పరిచయం చేసిన స్వామి వివేకానంద ఆదర్శప్రాయుడని వివేకానంద స్కూల్ కరస్పాండెంట్ రంగారెడ్డి అన్నారు. గురువారం వివేకానంద పాఠశాలలో వివేకానందుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో గురువారం స్వామి వివేకానందుని జయంతిని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు, జేవీవీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానందుడిని యువతీ యువకులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి, కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ అరవింద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రితీష్, సిద్ధేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని గనశ్యాం కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో వివేకానందుడి జయంతిని నిర్వహించారు.

పామిడి: స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శప్రాయుడని వక్తలు పేర్కొన్నారు. గురువారం పామిడిలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో స్వామి వివేకానందుని 159వ జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వివేకానంద, అల్లీపీరా, సుంకప్ప, మల్లికార్జున, భాస్కర్‌రెడ్డి, సింహన్న, సన్యాసప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు


అలంకరణలో గోదాదేవి అమ్మవారు

తాడిపత్రి అర్బన్: రెడ్డివారిపాలెంలోని కోదండ రంగనాథస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు శేషాద్రి పర్యవేక్షణలో వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య గోదా దేవి, కోదండ రంగనాథ స్వామి వార్లకు పంచామృతాలు, పలు విధ పరిమళ భరిత ద్రవ్యాలు, పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలు, ఎన్నో రకాల సుగంధ సోయగ పుష్పాలతో సర్వాలంకరణ భూషితంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు శేషాద్రి మాట్లాడుతూ పన్నెండు మంది ఆళ్వారులలో ఆండాళ్ (గోదాదేవి) అమ్మవారు ఒకరని, ధనుర్మాసంలో గోదాదేవి రచించిన పాశురాలు వైష్ణవ ఆలయాల్లో గానం చేయడం అనాదిగా వస్తున్న ఆచారమని, ఆధ్యాత్మిక సాహిత్యంలో తిరుప్పావై విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందన్నారు. అనంతరం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

తాడిపత్రి అర్బన్: బ్రాహ్మణపల్లికి చెందిన జయచంద్రారెడ్డి గురువారం అక్రమంగా ఇసుక తరలిస్తుండడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సెబ్ అధికారి విజయ్‌కుమార్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గుంతకల్లు: స్థానిక హిందీ ప్రచారక్ మహా విద్యాలయంలో గురువారం 2001-02 (హిందీ పండిట్ ట్రైనింగ్) పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. దాదాపు 20 సంవత్సరాల తర్వాత కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. నాటి గురువులు మహమ్మద్‌సాదిక్, లోకేశ్వర్‌రావు, చంద్రశేఖర్, రాధకుమారిను ఘనంగా సత్కరించారు.

రైతులకు అండగా నిలిస్తే అక్రమ కేసులా?

గార్లదిన్నె: టీడీపీ హయాంలో రైతులకు అండగా నిలిచినందుకు తమ పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించారని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడారు. 2016లో ప్రభుత్వం సక్రమంగా ఆయకట్టు నీరు అందించలేదని, రైతుల కోసం ఆందోళన చేస్తే టీడీపీ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టించిందన్నారు. అక్రమ కేసులతో నేటికీ తమ పార్టీ నేతలు కోర్టు చుట్టూ తిరుతున్నారన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక రుద్రంపేట పంచాయతీ పరిధిలోని సచివాలయం-2లో క్షయ బాధితులకు అందించారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెల్త్ సూపర్‌వైజర్లు చంద్రమోహన్, ఓబిరెడ్డిల ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించనున్నారు.

రీ సర్వే పారదర్శకంగా చేపట్టాలి


గుడిపాడులో భూ సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్న, ఆర్డీఓ రవీంద్ర

యాడికి: భూముల రీ సర్వే ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఆర్డీఓ రవీంద్ర ఆదేశించారు. గురువారం ఆయన గుడిపాడులో పర్యటించారు. గ్రామంలోని ఆర్బీకేలో తహసీల్దార్ అలెగ్జాండర్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రాజ్‌కుమార్, ఆర్ఐ ఆనందబాబు ఆచారి, గ్రామ సరేయర్, రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా వందేళ్ల తర్వాత ఏపీలో భూ రీ సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా రీ సర్వే హద్దు రాళ్లు, గ్రౌండ్ వాల్యుయేషన్, ముటేషన్ల పరిష్కారం , దేవదాయ, గ్రామ కంఠం భూముల తొలగింపు తదితర అంశాల పురోగతిపై ఆర్డీఓ సమీక్షించారు. సర్వే కొలతల్లో వ్యత్యాసం, పొరపాట్లు, విమర్శలకు తావివ్వకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం గుడిపాడులో జరుగుతున్న భూ సర్వేను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

రైల్వే బ్రిడ్జీల కింద నీటి నిల్వలపై చర్యలు చేపట్టాలి

గుంతకల్లు: డివిజన్ వ్యాప్తంగా అండర్ బ్రిడ్జిల కింద నీటి నిల్వ ద్వారా ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని గుంతకల్లు రైల్వే జోన్ సాధన సమితి అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జిల కింద వరద నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ఆయనతోపాటు గుంతకల్లు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలతో కలిసి డీఆర్ఎం కే.వెంకటరమణారెడ్డికి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో ఆయన మాట్లాడుతూ డివిజన్ వ్యాప్తంగా ప్రమాదల నివారణలో భాగంగా ఎల్సీ గేట్లు మూసివేసి దాని స్థానంలో రోడ్డు అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారన్నారు. ఈ నిర్ణయం మంచిదే అయినా నిర్మాణ సమయంలో సరైనా ప్లానింగ్ లేకపోవడంతో బ్రిడ్జిలు కింద నీటి నిల్వలు ఉంటున్నాయన్నారు. వర్షాకాల సమయంలో వరద నీరు చేరడంతో బ్రిడ్జికి రెండు వైపులా ఉన్న గ్రామాలకు రాకపోకలు బంద్ అవుతున్నాయన్నారు. కొందరు బ్రిడ్జిల కింద రాకపోకలు సాగించి ప్రమాదాల బారిన పడుతున్నారని ఆరోపించారు. వచ్చే వేసవిలో బ్రిడ్జిల వద్ద నీళ్లు నిలబడకుండా మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు కాసిరావు, జ్ఞానేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, ఓబులేసు, సురప్ప, లక్ష్మీనారయణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాడిపత్రి: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం సామాజిక తనిఖీపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ సరస్వతి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డిస్టిక్ విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఏపీడీ వెంకటరత్నం, ప్రిసైడింగ్ అధికారి సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా డీఆర్‌పీలు పంచాయతీల వారీగా సామజిక తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. పనుల్లో జరిగిన అవకతవకలపై డిస్టిక్ విజిలెన్స్ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యుల నుంచి సొమ్మును రికవరీ చేయాలని ఏపీడీని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రానికి పూర్తి స్థాయి నివేదికలు సిద్ధం అవుతాయని స్టేట్ రిసోర్స్ పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రంగారావు, ఏపీఓ గంగరాజు, ఈసీ శ్రీనివాసరెడ్డి ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు పాటించండి


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు

బుక్కరాయసముద్రం: రైతులు మొక్క జొన్న పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం రేగడి కొత్తూరు గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామసుబ్బయ్య మాట్లాడుతూ మొక్కజొన్న పంట లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ పంటలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. రాత్రి సమయంలో చలి ఎక్కువగా ఉన్నందున పంటకు ఎండు తెగులు వస్తోందని, నివారణకు లీటర్ నీటికి మాంకోజెబ్ 2 గ్రాములు లేదా కార్బండజైమ్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యాం సుందర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకుడు శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముత్యాల ముగ్గుల ఫైనల్ పోటీలు

గుంతకల్లుటౌన్: జగనన్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా మున్సిపల్ కౌన్సిల్ వారి సహకారంతో మెప్మా ఆధ్వర్యంలో 37 వార్డుల్లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి ముగ్గురి చొప్పున మొత్తం 111 మందికి శుక్రవారం ఫైనల్ పోటీలను నిర్వహించనున్నారు. ఈమేరకు మెప్మా టీపీఆర్ఓ మోహన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కథలగేరి మారెమ్మ ఆలయం వద్ద మధ్యాహ్నం 3 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజేతలకు ఫ్రిడ్జ్, ఎల్ఈడీ టీవీ, మిక్సర్ గ్రైండర్‌తో పాటు పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా బహుమతులను అందజేయనున్నట్లు ఆయన తెలియజేశారు.

శివ మాలధారులకు ముస్లిం కుటుంబం అన్నదానం


శివమాలధారులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో గురువారం శివ మాలధారులకు ఓ ముస్లిం కుటుంబం అన్నదానం చేసింది. అందరికీ దేవుడు ఒక్కడేనని, మత సామరస్యానికి ప్రతీకగా అన్నదానం చేసినట్లు ఆ కుటుంబం తెలిపింది.ఈసందర్భగా వారు సుమారు 300 మంది స్వయంగా భోజనం వడ్డించారు.

వసతి గదుల రేట్లు తగ్గించాలి

గుంతకల్లుటౌన్: టీటీడీ వసతి గదుల రేట్లను తగ్గించాలని గుంతకల్లు ఆర్డీఓ రవీంద్రను బీజేపీ నాయకులు కోరారు. గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు వడ్డేర మేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి కొలిమి రామాంజినేయులు తదితరులు ఆర్డీఓకు వినతపత్రం అందజేశారు. నాయకులు సూర్యనారాయణ, రవి బాబు, మహిళానాయకురాళ్లు విజయలక్ష్మి, శ్రీదేవి పాల్గొన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గుంతకల్లు రూరల్: వైటీ చెరువు గ్రామానికి చెందిన అర్జున అనే వ్యక్తిని గురువారం సాయంత్రం గ్రామ శివారుల్లో అరెస్ట్ చేసిన సెబ్ పోలీసులు అతడి వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారా, బైకు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ మహేష్ కుమార్ తెలిపారు.